సాక్షి
వికారాబాద్

సోమవారం, 15, జనవరి, 2024



సీసీఐకి పోటెత్తిన పత్తి

వరుసగా నాలుగు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు కావడంతో పత్తి రైతు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



వరివైపే రైతుల మొగ్గు

రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో భూసారం తగ్గుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



దయనీయంగా బడులు

సర్కారు బడుల పరిస్థితి అధ్వానంగా మారింది. మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



అమ్మవారి పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని దోర్నాల్‌పల్లిలో మైసమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, దొంగఎన్కేపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి, పార్టీ నేతలు యాదయ్యగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మించాలి

విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు



కోదండరాంను సన్మానిస్తున్న విద్యావంతుల వేదిక సభ్యులు

పరిగి: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పాత అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలని విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. ఆదివారం నగరంలోని కోదండరాం నివాసంలో విద్యావంతుల వేదిక జిల్లా కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. వ్యవసాయాధారిత జిల్లా అయినందున పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక జిల్లా కమిటీ సభ్యులు సోమశేఖర్, విజయ్‌కుమార్, అజయ్, సాయిరెడ్డి, తుల్జాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జన్‌మన్' ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించిన డీటీడీవో రాజేశ్వరి దేవి, ఇతర అధికారులు

కద్తాల్: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి చెంచు కుటుంబాలతో వర్చువల్ మీటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాట్లను డీటీడీవో రామేశ్వరిదేవి, ఇతర అధికారులు పరిశీలించారు. గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలలో కద్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని చెంచులతో మోదీ వర్చువల్ మీటింగ్ ద్వారా సమావేశం కానున్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు జన్‌మన్ బ్యాంకు అకౌంట్, కిసాన్ క్రెడిట్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, చెంచుల కోసం ప్రత్యేకంగా మెడికల్ ఎంఎంయూ వాహనం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మజ, కృష్ణవేణి, ఎంపీడీవో రామకృష్ణ, ఏఈ శ్రీనివాస్, వార్డెన్ రాములు, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' పేరిట అవకతవకలు

షాద్‌నగర్: రెండు పడక గదుల పేరిట గత పాలకులు అవకతవకలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మండల పరిధిలోనలి కొండన్నగూడ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను ఎమ్మెల్యే పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇండ్లు మొత్తం బీటలు వారి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని మండిపడ్డారు. వారి అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమన్నారు. అర్హులైన వారికి ఇళ్లు అందజేసేందుకు చర్యలు ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు.

గురుకులాలకు గూడేది..?

గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పుకొన్న గత ప్రభుత్వం.. వాటికి అవసరమైన భవనాలు, మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. నూతన ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకున్నా అధికారులు అనువైన స్థలాలు వెతికే పనిలో ఉన్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న పరిగి గురుకుల పాఠశాల

ఏడేళ్లు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

- ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్న గత ప్రభుత్వం
- కొత్తగా మంజూరు చేసినవన్నీ అద్దె భవనాల్లోనే..
- మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- మైదానాలు లేక ఆటపాటలకు దూరం
- నిర్వహణలోపంతో పక్క జిల్లాకు తరలిన వైనం

వికారాబాద్: ఆర్భాటంగా గురుకులాలు మంజూరు చేస్తూ వెళ్లిన ప్రభుత్వం వాటికి సొంత భవనాలు నిర్మించక పోవటంతో గురుకుల పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు మంజూరైన గురుకులాలు వాటి నిర్వహణ బాధ్యతలు గాలికొదలటంతో కొన్ని గురుకులాలు పక్క జిల్లాకు తరలి వెళ్లాయి.. మరికొన్ని చోట్ల కొందరు ప్రైవేటు వ్యక్తులు కొత్త భవనాలు నిర్మించి మరీ గురుకులాలకు అద్దెకిచ్చారు. కొన్ని చోట్ల గురుకులాల నిర్వహణకు అద్దె భవనాలు కూడా సమకూర్చక పోవడంతో అవి పక్క జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో కొనసాగాల్సిన నాలుగు గురుకులాలు రంగారెడ్డిలో కొనసాగుతుండగా.. అందులో రెండు మళ్లీ జిల్లాకు తీసుకువచ్చారు. జిల్లాలో కొనసాగుతున్న గురుకులాలు సైతం ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. మైదానాలు లేక విద్యార్థులు ఆటపాటలకు దూరమైతున్నారు. తల్లిదండ్రులు వచ్చినప్పుడు వారి పిల్లలతో మాట్లాడేందుకు సైతం చోటు కరువయింది. దీంతో చేసేది లేక గేటు పైనుంచే బయట నుంచే మాట్లాడి తెచ్చిన వస్తువులు సైతం గేటుపైనుంచే ఇచ్చి వెళ్లాల్సిన దుస్థితి. ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు చెల్లించిన అద్దె డబ్బులు ఖర్చు చేస్తే ఇప్పటి వరకు కొత్త భవనాలే తయారయ్యేవని జిల్లా ప్రజలు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం ఇంకా అధికారికంగా కొత్త భవనాలపై ప్రకటన చేయనప్పటికీ కలెక్టర్ ఆదేశంతో జిల్లాలో అధికారులు ఇటీవల గురుకులాలకు స్థలాలు గుర్తించే పనిలో పడ్డారు.

అద్దెభవనాలు.. ఇరుకు గదులు

గతంలో నియోజకవర్గానికి రెండు చొప్పున గురుకుల పాఠశాలలుండగా తెలంగాణ ప్రభుత్వం కొలువు దీరాక ఒక్కో నియోజకవర్గంలో నాలుగు గురుకులాల చొప్పున మంజూరు చేసింది. దీంతో జిల్లాలో గురుకులాల సంఖ్య 24కు చేరింది. గతంలో ఉన్న ఎనిమిది గురుకుల పాఠశాలలకు సొంత భవనాలుండగా తరువాత మంజూరైన గురుకులాలన్నీ అద్దె భవనాల్లో ప్రారంభించారు. ఏడేళ్లు దాటినా నేటికీ వాటికి సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో కొన్ని గురుకుల పాఠశాలలు రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతుండగా.. ఉన్న పాఠశాలలకు సైతం సక్రమంగా భవనాలు లేక ఇబ్బందులు తప్పటంలేదు. చాలా వరకు అద్దె భవనాలు.. ఇరుకు గదుల్లో నెట్టుకొస్తున్నారు. దీంతో పక్క జిల్లాలో ఇప్పటికే మూతబడిన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల దృష్టి గురుకుల పాఠశాలలవైపు మళ్లింది. గురుకుల పర్యవేక్షణాధికారులకు పర్సంటేజీలు ఇచ్చి వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు మూతబడిన తమ కళాశాలల భవనాలు వచ్చేలా వారితో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

జిల్లా దాటిన మహిళా డిగ్రీ కళాశాల

ఏడేళ్ల క్రితం జిల్లాకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి మహిళా డిగ్రీ కళాశాల మంజూరైంది. భవనం నిర్మించే వరకు జిల్లాలోని కొత్తగడిలో కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆ కళాశాలను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో నిర్వహించారు. అక్కడ కళాశాల వారు తమకు స్థలాభావం ఉందనడంతో చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని మెయినాబాద్‌కు మార్చారు. అక్కడ ఓ ఏడాది పాటు నిర్వహించిన అనంతరం చేవెళ్ల మండలం తోల్‌కట్ట సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల భవనానికి మార్చారు. ప్రస్తుతం ఆ భవానికి రూ.ఆరు లక్షలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు.

- రెండేళ్ల క్రితం పరిగిలో పరిగి, బురాన్‌పూర్‌కు చెందిన రెండు బీసీ గురుకుల పాఠశాలలు ప్రారంభించారు. వీటిలో ఒక్కో భవనానికి రూ.98 వేల చొప్పున అద్దె చెల్లించేవారు. రెండేళ్ల అనంతరం సమస్యలసాకుతో బురాన్‌పూర్ బీసీ గురుకుల పాఠశాలను చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల ఇంజనీరింగ్ కళాశాలకు మార్చారు. పరిగి గురుకులానికి చెందిన మూడు తరగతులు సైతం పక్క జిల్లాకు మార్చారు. ఇటీవలే అందులో ఒకటి మళ్లీ పరిగికి తీసుకువచ్చారు.
- గిరిజన బాలికల గురుకులాన్ని సైతం జిల్లా దాటించారు. గతంలో ఈ పాఠశాలకు రూ.98వేలు ఉండగా మార్చిన తర్వాత నెలకు రూ.10లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు.

కాసులు కురిపిస్తున్న కంది

- రికార్డు ధరలతో రైతుల్లో ఆనందం
- భౌగోళిక గుర్తింపుతో పెరిగిన డిమాండ్
- ప్రభుత్వ మద్దతుకు మించి రూ.3వేలు ఎక్కువ పలుకుతున్న రేటు

తాండూరు: తాండూరు అనగానే కంది పండించే రైతులు గుర్తుకు వస్తారు. నేల స్వభావం, నేలలోని పోషకాలు, వాతావరణ పరిస్థితులు, సాంప్రదాయ ఆధునిక మేళవింపు పద్ధతులతో ప్రత్యేక గుర్తింపు లభించింది. తాండూరు కంది పప్పునకు కేంద్రం ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ప్రకటించింది. సీజన్ ప్రారంభం నుంచే కందుకుల కొనుగోల్లు జోరందుకున్నాయి. ప్రభుత్వ మద్దతు ధరకు మించి రేటు పలుకుతోంది. దీంతో రైతుల 'పంట' పండుతోంది.

మద్దతు ధర తగ్గించిన కేంద్రం

జిల్లా పరిధిలో 20 మండలాల్లో కంది సాగుచేస్తున్నారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 1.90లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. పంట విస్తీర్ణం ప్రకారంలో జిల్లాలో ఎనిమిది నుంచి పది లక్షల క్వింటాళ్ల వరకు కంది ఉత్పత్తులు మార్కెట్‌కు రానున్నాయి. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.9,400 నుంచి రూ.9,800 వరకు ధర పలుకుతోంది. రెండేళ్లుగా కందులకు జాతీయ స్థాయిలో డిమాండ్ లేక కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.6,600 చొప్పున ధర నిర్ణయించింది. జాతీయ స్థాయిలో కంది ఉత్పత్తులకు డిమాండ్ పెరగింది. దీంతో తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన బిడ్డింగ్‌లో క్వింటాల్‌కు రూ.9,811 గరిష్ట ధర పలుకుతోంది. కనిష్టంగా రూ.8,811 ఉండగా సగటున రూ.9,369 పలికాయి. క్వింటాల్‌కు రూ.2,500 నుంచి రూ.3,200 వరకు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందులకు డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయలేదు.

రూ.28 కోట్ల వ్యాపారం

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో రూ.28 కోట్ల వ్యాపారం జరిగింది. మార్కెట్ కమిటీ పరిధిలో దాదాపు 79 కమీషన్ ఏజెంట్‌ల ద్వారా ఇప్పటి వరకు 30వేల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. జనవరి మొదటి వారం నుంచి కంది ఉత్పత్తులు మార్కెట్‌లు వస్తున్నాయి. మూడు నెలల పాటు కందుల వ్యాపారం కొనసాగ నుంచి. ఈ సీజన్‌లో 1.50లక్షల క్వింటాల్ పంట మార్కెట్‌కు రావచ్చని మార్కెటింగ్ శాఖ అంచనా వేస్తోంది.

తాండూరు దాల్‌గా జీఐ ట్యాగ్

తాండూరు కందిపప్పుకు కేంద్ర ప్రభుత్వం తాండూరు దాల్‌గా జీఐ ట్యాగ్(భౌగోళిక గుర్తింపు)నిచ్చింది. దీంతో జాతీయ స్థాయిలో తాండూరు కందిపప్పునకు మరింత డిమాండ్ పెరగింది. తాండూరు దాల్‌మిల్లుల్లో క్వింటాలు కందిపప్పుకు రూ.15,500 చొప్పున ధర పలుకుతోంది. ప్రస్తుతం వస్తున్న కంది ఉత్పత్తులు మిల్లుల్లోకి చేరితే ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.



ఆంధ్ర సంక్రాంతి బరిలో
మన పందెం కోడి



- జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో పెంపకం
- పౌష్టికాహారం.. ప్రత్యేకంగా తర్ఫీదు
- పండుగ వేళ ఫుల్ డిమాండ్
- రూ.50 వేల వరకు పలుకుతున్న ఒక్కో పుంజు

పహాడీషరీఫ్: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే కోడి పందేల కోసం తెలంగాణ కోడి పుంజులు కదనరంగంలోకి దూకేందుకు సిద్ధమయ్యాయి. రెండు నెలల ముందు నుంచే ప్రత్యేక తర్ఫీదు పొందిన పుంజులు ఎప్పుడెప్పుడు బరిలోకి దిగాలా అని కాళ్లు దువ్వుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగే కోడి పందేలకు.. హైదరాబాద్ పాత నగర శివారు ప్రాంతాలకు విడదీయరాని బంధం ఉంది. పరువు, ప్రతిష్టలే లక్ష్యంగా పందేలు కాసేవారు విజేతగా నిలిచే సత్తా ఉన్న కోడిపుంజుల వైపు మొగ్గు చూపుతున్నారు. కంటికి నచ్చిన మేలు జాతి పుంజుకు రూ.50 వేల వరకు కూడా వెచ్చించేందుకు వెనుకాడడం లేదు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో పందెం కోళ్ల కూతలు వినిపిస్తున్నాయి.

అల్లారుముద్దుగా..

ఎర్రకుంట, షాహీన్‌నగర్, కొత్తపేట, సలాల పరిసరాల్లో కుస్తీ పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే పహిల్వాన్లు మూగ జీవాలను కూడా అంతే మక్కువతో పెంచుతారు. ఈ క్రమంలోనే కాకి, డేగ, నెమలి, అస్లీ తదితర మేలు జాతి కోడి పుంజులను అదే రీతిలో పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటా సంక్రాంతి బరిలో దించుతుంటారు. ఇలా ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున జరిగే కోడి పందేలకు ఇక్కడి నుంచి కోళ్లను ఎగుమతి చేయడం పరిపాటిగా మారింది. కోట్లాది రూపాయలు వెచ్చించి పోటీలకు కాలు దువ్వే పందెంరాయుళ్లకు ఇక్కడి పుంజులు పంట పండించడం విశేషం.

వ్యాయామం సైతం

సంక్రాంతి పండుగకు రెండు నెలల ముందు నుంచే ఈ కోడి పుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. సాధారణంగానే నిత్యం వీటికి పౌష్టికాహారంతో పాటు వ్యాయామం చేయించే యజమానులు పండుగ బరి కోసం మరింత తర్ఫీదునిస్తారు. పందేనికి అన్ని రకాల సిద్ధమైన కోడి పుంజులను కొనుగోలు చేసేందుకు పందెం రాయుళ్లు పక్షం రోజుల నుంచే పహిల్వాన్లతో టచ్‌లో ఉంటారు. పరిమిత సంఖ్యలో పుంజులను పెంచి ఎంతో దగ్గరి వ్యక్తులకు మాత్రమే ఇక్కడ విక్రయిస్తుంటారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వీరు పెంచే పుంజులకు విటమిన్‌లతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు. బాదం, పిస్తా, అక్రోడ్, కీమా, రాగులు, ఉడికించిన గుడ్ల (తెలుపు భాగం)ను ఇస్తుంటారు. ప్రతిరోజు కోచ్‌లతో రెండు పూటలా మసాజ్‌లు చేయిస్తారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం

కొడంగల్ రూరల్: ధనుర్మాస ముగింపు సందర్భంగా ఆదివారం మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్మావతి సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్లకు తొలుత యజ్ఞ యాగాది క్రతువులు, పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అశేష భక్తజనం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. వైష్ణవాలయాల్లో ఈ కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. ధనుర్మాసంలో స్వామివారిని గోదాదేవి కొలిచి విధానం ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణంతో వివరించారు. ఉత్సవాల అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందించి భక్తులను ఆశీర్వదించారు.



గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

నగరంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గాలులు ఆగ్నేయం దిశ నుంచి వీస్తుండటంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పు వచ్చింది. ఆదివారం నగరంలో సగటున గరిష్ట ఉష్ణోగ్రత 33.2, కనిష్ట ఉష్ణోగ్రతలు 18.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే 3.7 డిగ్రీలు, కనిష్టం కంటే 3.2 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. గత నాలుగు దశాబ్దాల క్రితం నమోదైన ఉష్ణోగ్రత కంటే ఒక డిగ్రీ అధికంగా రికార్డు నమోదైనట్లు తెలుస్తోంది. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

పట్టా పాస్‌బుక్‌లకు డబ్బులు

పత్తి విత్తనాల విక్రయాల నుంచి మొదలు పంట అమ్ముకునే వరకు రైతన్నను అక్రమార్కులు మోసం చేస్తూనే ఉన్నారు. రెండేళ్లుగా పంట పాడవడంతో దళారులు రైతుల పాస్‌బుక్‌లు తీసుకుని సీసీఐ కేంద్రాల్లో రైతుల పేరిట పత్తి అమ్ముతున్నారు.

- పత్తి విక్రయానికి దళారుల కొత్త ఎత్తులు
- నాలుగేళ్లుగా కొనసాగుతున్న దందా!
- ఎనిమిది ఎకరాల పట్టా పాస్‌పుస్తకం ఉంటే రూ.12వేలు

పెద్దేముల్: మండల పరిధిలో పత్తి దళారులు రెచ్చిపోతున్నారు. తేమ, తూకాల్లో దోచుకుంటున్నారు. అన్నదాతల పట్టా పాస్‌బుక్‌లకు గాళం వేస్తున్నారు. ఎనిమిది ఎకరాల పత్తి పంట సాగుచేసిన పట్టా పాస్‌బక్ ఉంటే రూ.10 నుంచి రూ.12వేల వరకు ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. ఏడాది పాటు పంటలకు మందులు ఉచితంగా అందజేస్తామని రైతులను ఊదరగొడుతున్నారని చర్చించుకుంటున్నారు. రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాగానే విత్‌డ్రా చేస్తున్నారు. మరికొంతమంది ముందస్తుగా చెక్కులు తీసుకుని వారి ఖాతాల మీద విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

పంటనష్టం.. దళారులకు వరం

మూడేళ్లుగా భారీ వర్షాలకు పత్తి పంటలు పాడవ్వడం.. దిగుబడి పడిపోవడంతో దళారుల రైతుల పట్టాపాస్‌బుక్‌ల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు పట్టాపాస్‌బుక్‌లు తప్పనిసరి. ఒక ఎకరా పాస్‌బుక్ ఉంటే సీసీఐలో 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తారు. అన్నదాతల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని సీసీఐలో అమ్ముకునేందుకు రైతుల పట్టాపాస్‌బుక్‌ల కోసం దళారులు గ్రామాల్లో రైతులను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ నుంచి ధృవపత్రాలు తీసుకుని రైతుల పట్టాబుక్‌లపై సీసీఐ కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం తెలంగాణ ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన నాటి నుంచి కొనసాగుతున్నాయని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. రైతులు తీసుకెళ్లిన పత్తికి ఒక ధర.. దళారులు తీసుకెళ్లిన పత్తికి ఎక్కువ ధర పెట్టడంతో రైతులు దళారులను ఆశ్రయించవలసి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రంలో లోడ్ ఖాళీ చేస్తున్న లారీ(ఫైల్)

'హస్తం'లోకి వస్తాం!

- కాంగ్రెస్ వైపు పాత కాపుల చూపు
- సొంత గూటికి వచ్చేందుకు కొందరు నేతల ప్రయత్నాలు
- మంత్రులు, ముఖ్య నేతలతో మంతనాలు

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు పాత కాపులు ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంతో పాత పరిచయాలతో ఒక్కొక్కరుగా మంత్రులు, ముఖ్య నేతల టచ్‌లోకి వెళ్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో గ్రేటర్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ ముఖ్యనేతలు తమ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా ఆ పార్టీని వీడారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు

రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అవిశ్వాస తీర్మానాలకు తెర లేచిన నేపథ్యంలో జీహెచ్ఎంసీపై కూడా కాంగ్రెస్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. మంత్రులు, ముఖ్య నేతలతో సైతం వీరు భేటీ అయినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు ముందే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. బల్దియా ఎన్నికల నాటికి నగరంలో పార్టీని బలోపేతం చేయాలని అధిష్టానం భావించడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

గతంలో పరిస్థితి ఇలా..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలు కాగా.. అప్పట్లో గ్రేటర్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి అధికార పక్షంలో చేరారు. గత ఐదేళ్ల క్రితం జరిగిన శాసన సభ ఎన్నికల అనంతరం కూడా అదే పరిస్థితి పునరావృతమైంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి కేవలం ఉనికికే పరిమితమైంది. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో జరిగిన ఎన్నికల్లో పోటీ 52 స్థానాలను గెలిచి మజ్లిస్ సహకారంతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక 2016, 2021లలో జరిగిన బల్దియా ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలకు పరిమితమైంది. అంతకుముందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సబితారెడ్డి, దానం నాగేందర్, కూన శ్రీశైలం, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, ఆయన కుమారుడు రవికుమార్, జయసుధ, మాజీ మేయర్ కార్తికరెడ్డి, విక్రమ్ గౌడ్ సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు. తాజాగా ఇందులో కొందరు తిరిగి సొంత గూటికి వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

క్లుప్తంగా

పాడి పంటలతో విరాజిల్లాలి



భోగిపండుగను జరుపుకొంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి: సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో భోగిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని కోరారు. పాడి పంటలతో పల్లెలు విరాజిల్లాలని ఆకాంక్షించారు.

కేంద్రాన్ని నిలదీసేందుకే రాహుల్ యాత్ర

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తన వాహనానికి న్యాయ్ యాత్ర స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్: ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభించినట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఆదివారం యాత్రకు సంబంధించిన స్టిక్కర్‌ను ఎమ్మెల్యే తన వాహనానికి అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఉన్న సమస్యల పరిష్కారానికి 67 రోజుల పాటు 6,713 కిలో మీటర్ల మేర సాగే బస్సు, పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్ రాష్ట్రం నుంచి గుజరాత్ వరకు కొనసాగనున్న ఈ యాత్రతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై భరోసా పెరగనున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం



బూడిదైన గుడిసె

కొడంగల్ రూరల్: విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధి అంగడిరాయిచూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎరుకలి మల్లప్ప గుడిసెలో 7మంది కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గుడిసెలో చోటుచేసుకున్న షాట్ సర్క్యూట్‌వలన మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని పసిగట్టిన కుటుంబీకులు బయటకు వచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఫలితం లేకుండా పోయింది. దీంతో గుడిసెతో పాటు రూ.10వేల నగదు, బియ్యం, బట్టలు, సామగ్రి కాలి బూడిదయిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

జూదరుల అరెస్టు

అనంతగిరి: ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ఇద్దరు జూదరులను టాస్క్‌ఫోర్స్, వికారాబాద్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మట్కా ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు, ఎస్పీ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్.. సోదాలు నిర్వహించారు. ఇందులో లాల్‌మహ్మద్, జబ్బార్‌లు మొబైల్ ద్వారా ఆన్‌లైన్ రూపంలో మట్కా ఆడుతున్నారని నిర్ధారించుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి రూ.9,960 నగదు, రెండు సెల్ ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

మొయినాబాద్/చేవెళ్ల: రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న అవర్లీ బేస్డ్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీచర్స్ శ్రీనివాస్‌గౌడ్, రమేష్, శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం మోడల్ స్కూల్ టీచర్లు టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో 1,241 మంది టీచర్స్ పనిచేస్తున్నామని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. దీనిపై కోదండరామ్ సానుకులంగా స్పందించినట్టు వారు తెలిపారు.

సీసీఐకి పోటెత్తిన పత్తి

- రోజుకు 2వేల క్వింటాళ్ల కొనుగోళ్లు
- వరుస సెలవులతో రైతుల ఆందోళన



పత్తి లోడుతో అయ్యప్ప కాటన్ మిల్లుకు బారులు తీరిన వాహనాలు

మోమిన్‌పేట: వరుసగా నాలుగు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు కావడంతో పత్తి రైతు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ విపణిలో తెల్ల బంగారానికి డిమాండ్ తక్కువగా ఉందని, మద్దతు ధర కంటే రూ.500లు తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారని, అందుకే సీసీఐకి విక్రయిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. కానీ వరుస సెలవులతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ నమోదును బట్టి..

వరుసగా సెలవుల నేపథ్యంలో సీసీఐ కేంద్రంలో కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 కాగా.. జనవరి 1 నుంచి రూ.100లు తగ్గించి తీసుకుంటుండగా.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.500లు తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారు. దీని వలన స్థానికంగా ఉన్న అయ్యప్ప కాటన్ మిల్లులో ప్రభుత్వం.. సీసీఐ ద్వారా పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. మండల పరిధి గ్రామాల రైతులు పత్తిని ఇక్కడికే తీసుకు వస్తున్నారు. రోజుకు 2వేల క్వింటాళ్ల వరకు సీసీఐ కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు సుమారు 42వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసింది. ఎకరాకు 12క్వింటాళ్ల చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఆన్‌లైన్‌లో నమోదును బట్టి పత్తిని తీసుకుంటున్నారు.

ఓటీపీ వచ్చిన వారి నుంచి..

రైతుల ఆధార్ నంబరును ఎంట్రీ చేసిన వెంటనే ఓటీపీ వస్తుంది. అలా వచ్చిన వారి నుంచే పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. కావున రైతులు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం నంబరు, పట్టాదారు పాసు పుస్తకం నంబరు తప్పని సరిగా ఫోన్ నంబరుకు అనుసంధానం అయి ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో పంటల నమోదు సమయంలో పత్తిని ఎన్ని ఎకరాల్లో సాగు చేశామో ఏఈఓలకు తెలిపి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటేనే అమ్ముకునేందుకు వీలు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఒక వేళ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోని ఎడలా ఉన్నాతాధికారులైన ఆర్‌ఐ, ఏఈఓల ద్వారా ధృవీకరించినా సరిపోతుందని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువత

కోట్‌పల్లికి సందర్శకుల తాకిడి

ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు కుటుంబాలతో పాటు, సాధారణ పౌరులతో ఆదివారం కోట్‌పల్లి జలాశయం కళకళలాడింది. తొలుత ప్రాజెక్టు పరిసరాలను సందర్శించిన పర్యాటకులు.. అనంతరం జలాశయంలో బోటింగ్ చేశారు. దీంతో కొంత కాలంగా బోసిపోయిన ప్రాజెక్టు.. సందర్శకుల తాకిడితో సరికొత్త ప్రాధాన్యత సంతరించుకుంది. – ధారూరు

వరివైపే రైతుల మొగ్గు



నాటేందుకు సిద్ధంగా ఉన్న నారుమడి

పంటమార్పిడిపై ఆసక్తి చూపని రైతులు

దౌల్తాబాద్: రైతులు ఎక్కువగా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల పంటల సాగుపై అవగహన ఉన్న వారు సైతం వరి వైపే మక్కువ చూపుతుండటంతో భూసారం తగ్గి, అధిక దిగుబడి సాధించడం కష్టమేనని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మండలంలో గత యాసంగిలో సుమారు 10వేల ఎకరాల్లో వరి పండిస్తే.. ప్రస్తుత సీజన్‌లో అదనంగా మరో వెయ్యి ఎకరాల్లో చెరువులు, బోరుబావుల కింద సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇక్కడి రైతులు వరినే ఎక్కువగా పండించి, దిగుబడులు పొందారు. అందుకే వరికే మక్కువ చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. మండల పరిధిలో చెరుకు, చిరుధాన్యాలు, కూరగాయాల సాగుకు కూడా సారవంతమైన నేలలు ఉన్నా.. వరినే పండిస్తున్నారు.

భూ సారాన్ని బట్టి..

చెరుకు సంవత్సర కాలం సాగు. సరైన రవాణా వ్యవస్థ చుట్టు పక్కల అందుబాటులో చక్కెర పరిశ్రమలు లేకపోవడంతో సాగు తగ్గించనున్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వేసిన తుకాలు ఎదగకపోతే సంక్రాంతి తర్వాత పెసర, మినుములు సాగు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో అధికారులు పొలాలకు వెళ్లి, భూసార పరీక్ష చేయించి వాటి ఫలితాలను సంబంధిత భూమి రైతులకు అందజేశారు. మీమీ నేల సారాన్ని బట్టి పంటలు వేయాలని అన్నదాతలకు అధికారులు సూచిస్తున్నారు.

> **అవగాహన కల్పించాం**
>
> మండల పరిధి రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వనరులు లేని వారు ఆరుతడి పంట సాగు చేయాలని సూచించాం. భూసారాన్ని బట్టి నేలల్లో ఉన్న పోషకాలను వినియోగించుకుని, వాటికి తగినట్లుగా పంటలను సాగు చేయాలని సలహాలు, సూచనలు చేశాం.
>
> – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో జూదరులు

ధారూరు: అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేసిన సంఘటన ధారూరు మండలం గట్టెపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు గ్రామానికి చెందిన షేక్ జహంగీర్, ఎండీ జాకీర్, మందపాటి కన్నయ్య, ఓగులపురం రవి, బుజ్జయోల్ల సంగమేశ్‌లు గట్టెపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడిచేసి జూదరులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.6,500ల నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



భోగి మంటల వద్ద మహేందర్‌రెడ్డి కుటుంబీకులు

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి దంపతులు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబురాలకు ఆంధ్రాకు వెళ్లిన వారి కుటుంబం, శనివారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి పట్టణంలోని వియ్యంకుడు (ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అధికారి) నల్లవాట్ల రమణారెడ్డి ఇంట్లో పండుగ జరుపుకుంటున్నారు. ఆదివారం ఉదయం 4 గంటలకు ఇంటి ఆవరణలో ఇరు కుటుంబాలు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో నల్లవాట్ల చాముండేశ్వరి, మనీషా హిమదీప్ రెడ్డి దంపతులు, పట్నం రినీష్ రెడ్డి ఉన్నారు.


జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

మొయినాబాద్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామానికి చెందిన సబ్బుర్‌గారి శ్రీకాంత్(22) మూడేళ్లుగా మండల పరిధి తోలుకట్ట గ్రామంలో ఉండే తన బావ మల్లేశ్ వద్ద కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు పనికి వెళ్లి, రాత్రి 7 గంటలకు తిరిగి వచ్చేవాడు. రోజు మాదిరిగానే ఈ నెల 13న పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో శ్రీకాంత్.. తన సోదరికి ఫోన్ చేసి తనకు జీవితంపై విరక్తి వచ్చిందని.. అజీజ్‌నగర్ దగ్గర పురుగుల మందు తాగుతున్నాని చెప్పాడు. వెంటనే సోదరి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాంత్ కోసం వెతికారు. తోలుకట్ట సమీపంలోని ఓ వెంచర్‌లో అపస్మారకస్థితిలో పడున్న శ్రీకాంత్ కనిపించడంతో వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం



హసీనా



అఫ్రీన్



హుస్సేన్

పహాడీషరీఫ్: కుటుంబ కలహాల కారణంగా ఓ గృహిణి తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మంఖాల్ గ్రామానికి చెందిన హసీనా(30), యాసిన్ దంపతులకు అఫ్రీన్(14), హుస్సేన్(8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఇటీవల భార్య భర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలోనే గత నెల 18న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి వెళ్లిన హసీనా.. తిరిగి ఇంటికి రాలేదు. వారి కోసం వెతికినా ఆచూకి తెలియరాలేదు. దీంతో హసీనా తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఇతరులపై ఆత్మీయత చూపాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఘనంగా గోదాదేవి కల్యాణం



కొత్తూరు: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు

కొత్తూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆధ్యాత్మికత కలిగిన వారు తోటివారి పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామం అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఉరుకుల పరుగుల జీవనంలో దైవ చింతన చాలా వరకు ప్రశాంతత కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కృష్ణ, బాల్‌రాజు, శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

షాద్‌నగర్: యువతీయువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన యువకులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే విధంగా టోర్నీ నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. ఆటలతో మానసికంగా ఉల్లాసంగా ఉండటంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నీ విజేత జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్ ఆఫ్‌ది సీరిస్ ట్రోఫీలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బస్వం, శివశంకర్‌గౌడ్, ముబారక్, అందెమోహన్, ఖదీర్, సీతారాం, మధు, కబీర్ ఉన్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎల్లగమోని అంజయ్యయాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధి చింతకుంటపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ పార్వతమ్మ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లను, యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవచేయడానికి ముందుండాలన్నారు.ఆయా కార్యక్రమాల్లో జంగయ్యయాదవ్, పద్మ, గిరిజ, సంజయ్, ప్రవీణ్, రమేష్‌యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

చీరల పంపిణీ

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆదివారం సురంగల్‌లోని మెథడిస్ట్ చర్చిలో కాంగ్రెస్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, తదితర నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో రామలింగేశ్వర పొదుపు సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ లక్ష్మి హాజరై మాట్లాడారు. మన పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షుడు కృష్ణాజీ, పురుషోత్తంరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మల్లేశ్ పూజారి, రాకల మల్లేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ సరఫరా చేయండి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ సరఫరా చేయాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో సర్పంచ్ చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, కృష్ణగౌడ్, శకుంతలతో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినియోగదారుల అవసరాల దృష్ట్యా ఇక్కడ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు, సుదర్శన్, చెన్నయ్య, పెంటయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలోనూ ముందుండాలి



విజేతలతో ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఆటలతో పాటు సమాజసేవపై దృష్టి సారించాలి
- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కడ్తాల్ క్రికెట్ అసోసియేషన్–హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కడ్తాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన కడ్తాల్ మాన్‌స్టార్ జట్టుకు శ్రీనివాస్‌రెడ్డి రూ.25 వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. రన్నరఫ్‌గా నిలిచిన స్ట్రైకర్ టీంకు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.15,116తో పాటు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడారు. యువత ఆటలతో పాటు సమాజ సేవలోనూ ముందుండాలని సూచించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు త్వరలోనే ఐక్యవేదిక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాస్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాఘవేందర్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు జహంగీర్‌అలీ, రవీందర్‌రెడ్డి, వడ్డెరాజు, బండ శ్రీను, రాంచందర్, దేవేందర్‌గౌడ్, హర్షవర్ధన్, అశోక్‌రెడ్డి, మహేశ్, మణికంఠ, రమేశ్, జగన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షితలు

మొయినాబాద్/చేవెళ్ల: అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో ఆదివారం అక్షితల పంపిణీ చేపట్టారు. గ్రామంలోని రామమందిర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జనజాగరణ కార్యక్రమం నిర్వహించారు. రామనామంతో భజన కీర్తనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. గడపగడపకు అక్షితలు అందజేశారు.

షాబాద్: ఇంటింటికీ రాములోరి అక్షితలు పంపిణీ చేస్తామని సర్దార్‌నగర్ సర్పంచ్ మునగపాటి స్వరూప పేర్కొన్నారు. సర్దార్‌నగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శ్రీరాముడి అక్షితల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ అక్షితలను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అయోధ్యలో నిర్మితమవుతున్న శ్రీరామముడి ఆలయ ప్రాణప్రతిష్ఠ సమయంలో వేసిన అక్షితలను దేశవ్యాప్తంగా హిందువుల గృహాలకు చేర్చాలని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఆ అక్షితలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిరమ్మ, వార్డు సభ్యులు నర్సింహులు, కృష్ణ, జగదీశ్వర్, హరీశ్ రఘు, ప్రదీప్, చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిగూడలో..

అయోధ్య శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షితల పంపణీ నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డిగూడ సర్పంచ్ చందిప్ప జంగయ్య పేర్కొన్నారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో శ్రీరాముని అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పారు. కార్యక్రమంలో బాల్‌రాజు, రాజుగౌడ్, నర్సింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: ముడిమ్యాలలో అయోధ్య అక్షితలు పంపిణీ చేస్తున్న రామ భక్తులు